క్లుప్తంగా

శ్రీరామ నవమి శుభాకాంక్షలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏటా వసంత రుతువులో చైత్ర శుద్ధ నవమి రోజు వైభవంగా జరిగే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ శుభాలు కలిగేలా శ్రీసీతారాముల ఆశీస్సులు నిండుగా లభించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై 5 శాతం రాయితీ

నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై ఐదు శాతం రాయితీ ఇస్తున్నట్టు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ముందస్తుగా చెల్లించిన పౌరులకు ఈ రాయితీ వర్తించనుందన్నారు. 2025–26వ సంవత్సరానికి సంబంధించి మొదటి – రెండో అర్ధ సంవత్సరాల ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నును ఏకమొత్తంలో చెల్లింపు చేస్తే 5 శాతం రిబేట్ వర్తిస్తుందని, ఈ అవకాశం ఈ నెల 30 వరకు మాత్రమేనని స్పష్టం చేశారు. నగరవాసులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ముందస్తుగా పన్నులు చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

పది స్పాట్‌కు సెలవు ఇవ్వాలని వినతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని విజయవాడలో జరుగుతున్న పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌కు సెలవు ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఎన్టీఆర్ జిల్లా శాఖ నాయకులు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఫ్యాప్టో ఛైర్మన్ ఎ.సుందరయ్య, సెక్రటరీ డాక్టర్ ఇంటి రాజులు యూవీ సుబ్బారావును బిషప్ అజరయ్య హైస్కూల్‌లో జరుగుతున్న స్పాట్ కేంద్రంలో కలిసి వినతిపత్రాన్ని అందించి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల పక్షాన ప్రభుత్వానికి తెలియజేసి స్పాట్ కేంద్రానికి ఒక రోజు సెలవు ప్రకటించాలని కోరారు. పండుగను అందరూ జరుపుకోవటానికి సహకరించాలని సూచించారు. ఫ్యాప్టో నాయకులు వి.కొండలరావు, జె.రామకృష్ణ, బి.సుబ్బారెడ్డి, మస్తాన్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

11న ఉచిత నేత్ర వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామి మందిరంలో ఈనెల 11వ తేదీన శ్రీ మణికంఠ సోషల్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బల్లెం పూర్ణయ్య గురుస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువకుడు అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఊర్మిళానగర్‌కు చెందిన యువకుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఊర్మిళానగర్‌కు చెందిన రాచకుంట నవీన్ ఇంటర్ వరకు చదివి మానేశాడు. ఇంటికి సమీపంలోనే టిఫిన్ బండి పెట్టి వ్యాపారం చేస్తున్నాడు. గత నెల ఏడవ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ స్విచాఫ్ వస్తోంది. నవీన్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద, ఇతర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో తన కుమారుడు కనిపించడం లేదంటూ నవీన్ తండ్రి చిన్న కుమార్‌స్వామి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వాచ్‌మన్‌పై దాడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పిల్లర్‌లకు వినియోగించే ఇనుప చువ్వలు తీసుకుని వెళుతున్న వ్యక్తిని ప్రశ్నించిన వాచ్‌మన్‌పై దాడి చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీ విశాల్ మార్ట్ సమీపంలోని ఖాళీస్థలానికి చోడవరం మోహన్‌రావు(55) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి పిల్లర్‌లకు వాడే ఇనుప చువ్వలను తీసుకుని వెళుతున్నాడు. దీంతో వాచ్‌మన్ ఎవరు నువ్వు అని ప్రశ్నించగా సదరు వ్యక్తి పక్కనే ఉన్న రాయితో మోహన్‌రావుపై దాడి చేశాడు. దీంతో గాయపడిన వాచ్‌మన్ మోహన్‌రావు అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడుగడుగున అక్రమ నిర్మాణాలు

- ఇందిరానాయక్‌నగర్‌లో డ్రెయిన్లను ఆక్రమించి కట్టడాలు
- చినుకు పడితే నిండిపోతున్న రోడ్లు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): అజిత్‌సింగ్‌నగర్‌లో రోజురోజుకు పెరుగుతున్న అక్రమ నిర్మాణాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న ఇందిరానాయక్‌నగర్‌లో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నగరపాలకసంస్థ అనుమతులు లేకున్నా.. స్థానిక అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమ నిర్మాణాలను సాగిస్తున్నారు.

డ్రెయిన్లపై వాహనాల పార్కింగ్

మురుగునీటి పారుదలకు ఏర్పాటు చేసిన సైడు కాలువలను సైతం ఆక్రమించి భవన నిర్మాణదారులు కట్టడాలు చేపడుతున్నారు. దీంతో తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల వచ్చిన బుడమేరు వరదలకు ఇది కూడా ఒక కారణమని వారు వాపోతున్నారు. ఇందిరానాయక్‌నగర్‌లో చినుకు పడితే రోడ్లు నిండిపోయి ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయలతో భవంతులు నిర్మించుకున్న యజమానులు తమ కార్లు పార్కు చేసుకునేందుకు స్థలాన్ని కేటాయించకుండా డ్రెయిన్లను మూసివేసి వాటిపై పార్కు చేస్తున్నారు. దీంతో వర్షపు నీరు పారే దారిలేక రోడ్లపైకి చేరుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఖాళీస్థలాల్లో నిలుస్తున్న నీరు

వర్షపునీటి పారుదల లేకుండా డ్రెయిన్లను ఆక్రమించడంతో నీరు పక్కన ఉన్న ఖాళీస్థలాల్లోకి చేరుతోంది. దీంతో నిలువ ఉన్న ఆ నీటిలో దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అలాగే ఇందిరానాయక్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ రోడ్డు చూసిన చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. చెత్తకుప్పలు ఉన్న చోట పందులు గుంపులు గుంపులుగా ఇళ్ల మధ్యనే తిరుగుతున్న పారిశుద్ధ్య సిబ్బంది కాని.. నగరపాలకసంస్థ అధికారులు కాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఖాళీస్థలంలో నిలిచిన వర్షపునీరు



అయ్యప్పస్వామి ఆలయం రోడ్డులో డ్రెయిన్లను ఆక్రమించి వాహనాల పార్కింగ్

రోడ్లన్నీ ఆక్రమణలే

కాలనీలో రోడ్లన్నీ ఆక్రమణకు గురయ్యాయి. నిబంధనలను ఏ యజమాని పాటించడం లేదు. డ్రెయిన్లను పూర్తిగా ఆక్రమించారు. వర్షపు నీరు పారే దారే లేకుండా పోయింది. చిన్న వర్షం వచ్చిన రోడ్లు నిండిపోతున్నాయి. నగరపాలకసంస్థ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలి.

– శివారెడ్డి, ఇందిరానాయక్‌నగర్

జాక్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది

ఆ చిత్ర హీరో సిద్ధు జొన్నలగడ్డ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 10న విడుదల కానున్న జాక్ చలనచిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని ఆ చిత్ర హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. కామెడీ, లవ్, యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. జాక్ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా హీరో జొన్నలగడ్డ సిద్ధు, హీరోయిన్ వైష్ణవి చైతన్య, నిర్మాత డీవీఎస్ ప్రసాద్ శనివారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ విజయవాడ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జాక్ మూవీ స్టోరీ విన్నప్పుడు చాలా ఎక్సైటింగ్‌గా ఫీల్ అయ్యానని, ఈ చిత్రంలో హీరోయిన్‌తో కెమిస్ట్రీ బాగా వర్క్ అవుట్ అయిందన్నారు. ఇంటర్వెల్ సన్నివేశాలు ఉత్కంఠకు గురి చేస్తాయన్నారు. జాక్ చిత్రానికి ముగ్గురు సంగీత దర్శకులు పనిచేశారని, ఒక్కొక్క పాట చాలా డిఫరెంట్ గా ఉంటుందన్నారు. త్వరలో టిల్లు క్యూబ్, తెలుసు కదా సినిమాలతో ప్రేక్షకుల ముందుకి రాబోతున్నానని అన్నారు. హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ సిద్ధు జొన్నలగడ్డతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో జాక్ మూవీ హీరో హీరోయిన్లు సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య, నిర్మాత ప్రసాద్

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): ఒకటో తేదీ రాగానే ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, పిల్లల ఫీజులు తదితర ఆర్థిక భారాలు పారిశుద్ధ్య కార్మికుల మీద ఎక్కువగా ఉన్నాయని, అందుకే ఒకటో తేదీకి వృద్ధాప్య పెన్షన్లు చెల్లిస్తున్న మాదిరి పారిశుద్ధ్య కార్మికులకు కూడా జీతాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, స్కూలు ఫీజులను అధిగమించి కనీస వేతనం అమలు కాకపోయినా ఇచ్చిన దాంట్లోనే సరిపెట్టుకొని జీవనం సాగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పనులు చేసే డివిజన్లకు చేరుకోవటానికి రవాణా చార్జీలకు ప్రతిరోజూ వందలు వెచ్చిస్తున్నారని, జీతాలు సక్రమంగా అందకపోతే అప్పులు చేసి రవాణా చార్జీలు చెల్లించి డ్యూటీలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశామని, కూటమి ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలని కోరారు.

ఈఎస్ఐతో కార్మికులకు ఆరోగ్య రక్ష

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్మికులకు పూర్తి రక్షణ కల్పించే ఏకైక బీమా పథకం ఈఎస్ఐ అని గుణదల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వర్రా జ్యోతి పేర్కొన్నారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఈఎస్ఐ గుణదల ఆసుపత్రి సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) విజయవాడ యూనిట్, ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈఎస్ఐ గుణదల ఆసుపత్రి జనరల్ మెడిసిన్, సర్జికల్, గైనకాలజీ, గుండె వైద్య విభాగాల నిపుణులు, రమేష్, కామినేని ఆసుపత్రికి చెందిన వైద్యులు, అమరావతి కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ గుణదల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పూజారి రాజేష్, ఐజేయూ జాతీయ సమితి సభ్యుడు షేక్ బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్, కార్యదర్శి దాసరి నాగరాజు, చిన్నపత్రిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘురాం తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వర్రా జ్యోతి

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. అజిత్‌సింగ్ నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శనివారం డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ తొలి దళిత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్పొరేటర్లు శర్వాణీ మూర్తి, కుక్కల అనిత, నాయకులు యరగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయ్, కాళ్ల ఆదినారాయణ, శ్యామ్, తోపుల వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో..

మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి, అధ్యాపకులు జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, అధ్యాపకుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీబీఏలో..

విజయవాడలీగల్: బాబూ జగ్జీవన్‌రామ్ జీవితచరిత్ర స్ఫూర్తిదాయకమని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా అన్నారు. బార్ అసోసియేషన్ హాలులో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, జాయింట్ సెక్రటరీ జీవీ లక్ష్మి, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్, వీ గురునాథం, సంపర శ్రీనివాసరావు, కండెల వరప్రసాద్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక, ఎల్‌బీఎస్‌నగర్‌ల్లో శనివారం జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టీడీపీ ఎస్సీసెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అజిత్‌సింగ్‌నగర్ అమెరికన్ ఆసుపత్రి సెంటర్‌లో డాక్టర్ అంబేడ్కర్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యాన జగ్జీవన్‌రామ్ జయంతి జరిగింది.

లబ్బీపేట(విజయవాడతూర్పు): బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం గిరిపురం రెడ్‌సర్కిల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల రమేష్, మరియరాణి, కొమ్ము చంటి, మోహన్‌రావు, నాగభూషణం పాల్గొన్నారు.

పేదల పెన్నిధి జగ్జీవన్ రామ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాబూ జగ్జీవన్‌రామ్ పేదల పెన్నిధి అని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప అన్నారు. డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం జింఖానా మైదానం వద్ద ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టి రాయప్ప మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా, రక్షణ మంత్రిగా, రైల్వే మంత్రిగా ఇలా ఏ పదవి చేపట్టినా సమర్థవంతంగా నిర్వహించారన్నారు. డీహెచ్‌పీఎస్ నాయకులు సంగుల పేరయ్య, కొడాలి ఆనందరావు, కాళ్ల విజయ్, పీ రాజు, స్టాలిన్, రాము, జగన్నాథం, విమల్, కలపాల సైమన్ పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, శ్రీశైలజ

గొప్ప నాయకుడు జగ్జీవన్‌రామ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప జాతీయ భావాలు కలిగిన నాయకుడని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. జింఖానా మైదానం వద్ద జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో జగ్జీవన్‌రామ్ చురుకైన పాత్ర పోషించారని అన్నారు. మహాత్మా గాంధీజీ స్ఫూర్తితో శాసనోల్లంఘన ఉద్యమం, సత్యాగ్రహంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పీ శరత్, శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.



కండ్రికలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా



బీబీఏ హాలులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్: నగరకళా సంస్థల ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం నిర్వహించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ పీడిత ప్రజల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు, గోళ్ల నారాయణరావు, శ్రీకళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, బీవీ వీరభద్రరావు, బోడి ఆంజనేయరాజు, వివిధ రంగాల సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ప్రిన్స్, డాక్టర్ కమ్ముల శేషుకుమార్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పార్వతీదేవి అమ్మవారికి విశేషంగా గాజులు, పలురకాలు పూలుతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎన్ రాజు మాట్లాడుతూ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి సారే సమర్పించడం జరుగుతుందన్నారు. అలాగే శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారు శాకంబరీ దేవిగా శనివారం పూజలు అందుకున్నారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ఆలయ అర్చకులు అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.



శాకంబరీ అలంకారంలో శివకామేశ్వరీ అమ్మవారు

శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామ మందిరంలో ఆదివారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరిగే శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మందిర అభివృద్ధి, నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు తెలిపారు. స్థానిక దేవీనగర్ శ్రీకోదండ రామ మందిరంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు మూల విరాట్‌లకు పంచామృత, సహస్ర ధారాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. రాత్రి ఏడు గంటలకు జంగం విజయ్‌కుమార్ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన, సోమవారం శ్రీనివాస్‌చే మిమిక్రీ, మంగళవారం శైలశ్రీ శిష్యబృందం కూచిపూడి నృత్యం జరుగుతాయన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందిర కమిటీ ఉపాధ్యక్షులు కే సాంబశివరావు, సీహెచ్ వెంకట సుబ్బారెడి, సంయుక్త కార్యదర్శి డీ రామారావు, కోశాధికారి పంద్రాజు నాగ మధుసూధన రావు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దుర్గమ్మకు నృత్యార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు కళాకారులు శనివారం నృత్యార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన నృత్యాచార్య వేదాంతం పార్థసారథి సారథ్యంలో 25 మందికి పైగా కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మ వారి పంచ హారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యాన్ని భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించి వారిని అభినందించారు. అనంతరం కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.



నగరంలో ప్రీమియం జ్యూవెలరీ బ్రాండ్ ఇంద్రియా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ప్రీమియం జ్యూవెలరీ బ్రాండ్ ఇంద్రియా స్టోర్‌ను విజయవాడలో ప్రారంభించారు. మహాత్మాగాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను శనివారం సినీ నటి హన్సిక మాత్వాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రియా జ్యూవెలరీ అద్భుతమైన నైపుణ్యంతో వినియోగదారులకు ఆభరణాలపై ఉన్న ప్రేమను మరింత గొప్పదిగా మారుస్తుందన్నారు. అనంతరం ఇంద్రియా సీఈఓ సందీప్ కోహ్లి మాట్లాడుతూ సంప్రదాయం, ఆధునికత కలిసి ఉండే విజయవాడ వంటి నగరం తమ దృక్పథానికి పరిపూర్ణ వేదిక అని అన్నారు. హైదరాబాద్‌లో మూడు స్టోర్లు తర్వాత దక్షిణ భారతదేశంలో ఇది నాలుగో స్టోర్ అని చెప్పారు. కార్యక్రమంలో రిటైల్ హెడ్ అనంత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రియా జ్యూవెలరీ షోరూంను ప్రారంభించి నగలను ప్రదర్శిస్తున్న సినీ నటి హన్సిక, సందీప్ కోహ్లి

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

విజయవాడస్పోర్ట్స్: దేశానికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పరిపాలనా అధికారి రమావత్ వెంకట రమణనాయక్ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని శాప్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి ఉద్యోగులతో నివాళులర్పించారు. ఏఓ వెంకట రమణనాయక్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ వేత్తగా జగ్జీవన్‌రామ్ కీర్తి గడించారని, సమసమాజ స్థాపనకు కృషి చేశారని కొనియాడారు. 1971 ఇండో–పాక్ యుద్ధ సమయంలో ఆయన రక్షణ శాఖ మంత్రిగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీఎస్‌వో ఎస్ వెంకటరమణ, స్పోర్ట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాప్ ఏఓ వెంకట రమణనాయక్

ముగిసిన భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదినోత్సవ వేడుకలు సత్యనారాయణపురంలోని గాయత్రీ కల్యాణ మండపంలో ఘనంగా ముగిశాయి. గత నెల 30న ప్రారంభమైన ఈ ఉత్సవాలు శనివారం సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణంతో ముగిశాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వామివారి జన్మదినోత్సవాల్లో పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందన్నారు. వారం రోజుల పాటు వేడుకలను నిర్వహించిన కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గుళ్లపల్లి శివశర్మ, గుళ్లపల్లి విశ్వనాథ ఘనాపాటి, చింతపల్లి ఆంజనేయ ఘనాపాటి సహా పలువురు వేదశాస్త్ర పండితులను ఘనంగా సన్మానించారు. స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు జేకే సుబ్బారావు, చల్లా సుధాకర్, వేద పండితులు పాల్గొన్నారు.



భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన ముగింపు వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు